# సీఎం కేసీఆర్ సభకు తరలిరావాలి

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 12: అభివృద్ధి, సంక్షేమ ఫలాలు సమానంగా అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు ఈనెల 15న హుస్నాబాద్‌లో జరిగే సీఎం సభకు ప్రజలు భారీగా తరలిరావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ ఇన్‌చార్జి మచ్చ వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. హుస్నాబాద్‌లో జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేసేందుకు పలు వార్డుల్లో బీఆర్ఎస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ముందున్నదన్నారు. ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. సీఎం సభను తరలివచ్చేందుకు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టి గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు కొంకట నళినిదేవి, బోజు రమాదేవి, గోవిందు రవి, పెరుక భాగ్యారెడ్డి, గూళ్ల రాజు, బొల్లి కల్పన, జనగామ రత్నమాల, మిర్యాల రమేశ్, బొజ్జ హరీశ్, వాల సుప్రజ, కోఆప్షన్ సభ్యులు శంకర్‌రెడ్డి, ఆయూబ్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న

## ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

హుస్నాబాద్‌రూరల్, అక్టోబర్ 12: హుస్నాబాద్‌లో ఈ నెల 15న నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని పొట్లపల్లిలో ఆయన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆశీర్వాద సభకు పొట్లపల్లి నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి ఎమ్మెల్యేగా సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వంగ వెంకట్రాంరెడ్డి, నాయకులు గద్దం మల్లయ్య, రవీందర్‌రెడ్డి, సలీం, నర్సింహారెడ్డి, పాకాల శ్యాంసుందర్‌గౌడ్, వెంకటస్వామి, మార్క అనిల్ గౌడ్, నాంపల్లి శంకర్, రాచపల్లి శ్రీను, చుక్క శ్రీనివాస్, మల్లయ్య, సంతోష్, శ్రీధర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# 25 వేల మందితో కదిలివస్తాం

అక్కన్నపేట, అక్టోబర్ 12: హుస్నాబాద్‌లో ఈ నెల 15న జరిగే సీఎం కేసీఆర్ సభకు భారీగా తరలిరావాలని ప్రోగ్రాం మండల ఇన్‌చార్జి ఎడ్ల సోమిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని గౌరవెల్లి, కెప్టెన్‌కాలనీ, జనగామ, గుబ్బడి, గొల్లకుంట, అంతక్కపేట, అక్కన్నపేట, పంతుల్ తండా, కేశనాయక్‌తండా గ్రామాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. అక్కన్నపేట మండలం నుంచి 25 వేల మంది బహిరంగ సభకు వచ్చేలా ప్రణాళికలు చేశామన్నారు. సీఎం కేసీఆర్ రెండు దఫాలు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారన్నారు. బీఆర్ఎస్‌కు హుస్నాబాద్ లక్ష్మి నియోజకవర్గంగా మారిందన్నారు. బహిరంగ సభకు తరలివచ్చేందుకు వాహనాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సింగిల్ విండో డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పార్టీ శాఖ, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున్న బహిరంగ సభకు స్వచ్ఛందంగా రావాలని కోరారు. అక్కన్నపేట మండలంలో గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి, వాటి అభివృద్ధికి నిరంతరం సీఎం కేసీఆర్ కృషి చేశారన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీకి కార్యకర్తలే బలం, బలగమన్నారు. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి కండ్ల ముందు కనిపిస్తున్నదన్నారు. అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలంటే మరోమారు బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలన్నారు. మూడోసారి ఇటు ప్రభుత్వాన్ని, అటు హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జడ్పీటీసీ మాలోతు బీలునాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాసర్ల అశోక్‌బాబు, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాములు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంతక్కపేటలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి సోమిరెడ్డి



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీస్, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

## గుడుంబా స్థావరాలపై దాడులు

పెగడపల్లి, అక్టోబర్ 12: మద్దులపల్లి గ్రామ గిరిజన తండాపై జగిత్యాల ఎక్సైజ్ శాఖ, పెగడపల్లి పోలీస్ అధికారులు గురువారం మెరుపు దాడులు చేశారు. జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దాడుల్లో మద్దులపల్లి తండాలో గుడుంబా కోసం సిద్ధం చేసిన 700 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడంతో పాటు, 20 కిలోల బెల్లం, 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారు చేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీధర్ మాట్లాడుతూ.. దసరా పండుగతో పాటు, ఎన్నికల నేపథ్యంలో తండాల్లో గుడుంబా పెద్ద మొత్తంలో తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా నేరమని, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బీఎన్ నాయక్, ఎక్సైజ్ సీఐలు ప్రభాకర్‌రెడ్డి, అశోక్, పెగడపల్లి, ఎక్సైజ్ ఎస్ఐలు సీహెచ్ సతీశ్, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిట్ ఇండియా ఫ్రీడం రన్




ఫ్రీడం రన్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 12: పొలాస వ్యవసాయ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో 40 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ 4.0ను వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతి భట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మెరుగైన ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం నడక, పరుగెత్తే అలవాటును పెంపొందించుకోవాలన్నారు. ఫిట్ ఇండియా స్వచ్ఛతా ఫ్రీడం రన్‌ను అక్టోబర్ 1 నుంచి 31వ తేదీ వరకు స్వచ్ఛ భారత్, స్వస్థ్ భారత్‌లో భాగంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ టీ ఎల్లాగౌడ్, డాక్టర్ వీ రత్నాకర్, అధ్యాపకులు డాక్టర్ ఓ సంపత్, డాక్టర్ ఆర్ సాయికుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల అందజేత

సారంగాపూర్, అక్టోబర్ 12: లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన మలావత్ జల నిరుపేద కుటుంబానికి గురువారం జగిత్యాల జిల్లా సహాయక బృందం ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం, 15 రకాల నిత్యావసర సరుకులు, వెయ్యి నగదు అందజేశారు. మలావత్ జల భర్త సంవత్సరం క్రితం క్యాన్సర్‌తో మృతి చెందాడు. వీరికి ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న జిల్లా సహాయక బృందం సభ్యులు సహకారం అందించారు.

# ప్రతిష్ఠాత్మకంగా ప్రజా ఆశీర్వాద సభ

- సీఎం కేసీఆర్ తొలి సభను విజయవంతం చేద్దాం
- బహిరంగ సభ వద్ద అన్ని సౌకర్యాలు
- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్
- హుస్నాబాద్‌లో సభాస్థలం పనుల పరిశీలన



హుస్నాబాద్‌లో హెలిప్యాడ్ వద్ద బీఆర్ఎస్ యూత్ నాయకులతో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, అక్టోబర్ 12 : హుస్నాబాద్‌లో ఈ నెల 15వ తేదీన జరుగబోయే సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని కరీంనగర్ రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సీఎం సభ జరుగనున్న స్థలాన్ని స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించారు. సభాప్రాంగణం పక్కనే హెలీప్యాడ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలిసభను విజయవంతం చేయడానికి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సీఎం కేసీఆర్ సభకు రావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. మహిళా ప్రజాప్రతినిధులు, నాయకులు ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి సభకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. సభకు లక్షకు పైగా జనాన్ని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సభాప్రాంగణంలో సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి సమస్య రాకుండా సకల సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలీసులు భారీ భద్రతా ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎల్ఎస్ఎఫ్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, యూత్ నాయకులు క్రాంతిరెడ్డి, రమేశ్‌నాయక్, బొజ్జ హరీశ్, గందె చిరంజీవి, విజయభాస్కర్, పిడిశెట్టి రాజు, మాచర్ల ఐలేశ్ తదితరులు పాల్గొన్నారు.

### సభాస్థలంలో కొనసాగుతున్న పనులు

సీఎం కేసీఆర్ తొలి ప్రజాఆశీర్వాద సభ జరిగే స్థలంలో పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. సభావేదిక కోసం ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేసి చదును చేస్తున్నారు. సభాస్థలం పక్కనే హెలీప్యాడ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. సభాస్థలం చుట్టూ ఉన్న ఖాళీ స్థలాలను సైతం పార్కింగ్ కోసం చదును చేస్తున్నారు.